## క్లుప్తంగా

### ‘ఈ-తరం బాలలు’ పుస్తకావిష్కరణ




పుస్తకావిష్కరణ గావిస్తున్న సాహితీవేత్తలు

పెద్దకడబూరు : మండలంలోని కంబదహాల్ ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్య వేత్త, బాలబంధు గద్వాల సోమన్న 37వ కొత్త పుస్తకం ‘ఈ-తరం బాలలు’ పుస్తకాన్ని రచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో అంతర్జాతీయ శ్రీశ్రీ కళా వేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కర్నూల్ జిల్లా వినియోగదారుల ఫోరం జడ్జి నరహరి నారాయణ రెడ్డి, ఏ.ఎల్.కృష్ణారెడ్డి పుస్తకాన్ని అవిష్కరించారు. కవితాగానం అనంతరం సోమన్నను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కేశవయ్య, నాగేశ్వరరావు, వీరేష్, కవులు పాల్గొన్నారు.

### రక్తదానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్: పట్టణంలోని క్రాంతినగర్ వీధిలో శ్రీ అభయాంజనేయస్వామి సన్నిధిలో 130 మంది యువకులు ఆదివారం రక్తదానం చేశారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు జయమనోజ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జేఎంఆర్ యూత్ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆదోని బ్లడ్ బ్యాంకు డాక్టర్, సిబ్బంది పరీక్షలు చేసి రక్తాన్ని సేకరించారు. జయమనోజ్‌రెడ్డి తల్లి శైలజమ్మ ఇంటి ఆవరణలో కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలు, నాయకులకు పంచి పెట్టారు.

### ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీ ఎన్నిక

ఆదోని సెంట్రల్: స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశంలో ఆదోని 18 మందితో కూడిన పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కమిటీ అధ్యక్షుడిగా భరత్, పట్టణ కార్యదర్శిగా శ్రీనివాసులు, పట్టణ ఉపాధ్యక్షులుగా గౌస్ నాగరాజు,గణేష్ పట్టణ సహాయ కార్యదర్శులుగా పవన్, శశిధర్ కమిటీ సభ్యులుగా 12 మందిని ఎన్నుకున్నారు. నాయకులు రాజు,ఉదయ్, కిరణ్ పాల్గొన్నారు.

### ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం




ఆసుపత్రిలో బాలింతకు పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న దృశ్యం

కోసిగి: స్థానిక రైల్వే గేటు సమీపంలోని సిద్ధరూఢ ఆశ్రమంలో ఏబీవీపీ 75వ ఆవిర్భావ దినోత్సవంను పురస్కరించుకుని సంఘం మండల ప్రధాన కార్యదర్శి మల్లిస్వామి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది రాఘవేంద్రతో కలిసి బాలింతలు, రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. నాయకులు వినోద్ కుమార్, తిరుమల, వీరేంద్ర, బసవరాజు పాల్గొన్నారు.

### ప్రజలను ఆకట్టుకునేలా ‘లిల్లీ’

ఆదోని టౌన్: లిల్లీ సినిమాలోని అనుబంధాలకు అద్దం పడుతుందని, సెంటిమెంట్ సీన్లతో ప్రజలను ఆకట్టుకుంటుందని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలో నివాసముంటున్న యువకుడు రాజ్‌వీర్ నటించిన లిల్లీ సినిమాను సత్యం కాంప్లెక్స్‌లోని రాజ్ థియేటర్‌లో ప్రదర్శించారు. సినిమాను నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే వీక్షించారు. రాజ్‌వీర్ సినిమారంగంలో రాణిస్తుండడం సంతోషించదగ్గ విషయమని అభినందించారు.

### నీటి సమస్య పరిష్కరించాలి

ఆదోని రూరల్ : మండలంలోని గ్రామాల్లో నీటి సమస్య నెలకొందని, అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశులు, మండల కార్యదర్శి కె.లింగన్న కోరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు అడుగంటిపోవడంతో తీవ్రమైన తాగునీటి ఎద్దడి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా పెద్దహరివాణం, సంతకూడ్లూరు, మదిర, హానవాల్ గ్రామాల్లోని ఎస్ఎస్ ట్యాంకులు ఎండిపోయాయని, అలాగే కుప్పగల్, నేమలికల్లు ఎస్ఎస్ ట్యాంకులు అడుగంటిపోయాయన్నారు. రామాంజనేయులు, తిక్కప్ప, శేఖర్ పాల్గొన్నారు.

### నేడు పౌరాణిక నాటకం

ఆదోని అర్బన్ : సుల్తాన్‌పురం గ్రామంలో సోమవారం షేక్షావలితాత దర్గా ఉరుసు సందర్భంగా నవమాంకముల అనే పౌరాణిక నాటకం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు జయమనోజ్ రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు.

# పేద విద్యార్థుల కోసం..

- సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- విద్యార్థులకు వసతి, పౌష్టికాహారం
- ప్రతి నెలా కాస్మోటిక్ చార్జీల చెల్లింపు
- మూడో తరగతి నుంచి డిగ్రీ చదివే విద్యార్థులకు ప్రవేశం
- ఇప్పటికే పరిమితిని దాటేసిన చేరికలు
- అయినా కొనసాగుతున్న అడ్మిషన్లు



భోజనం చేస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ఇళ్ల వద్ద వసతి లేని పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను నెలకొల్పింది. గ్రామీణ ప్రాంతాల్లో చదివించడానికి స్థోమత, వసతులు లేక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను వసతి గృహాల్లో చేర్పుతున్నారు. ఇక్కడ చదివే విద్యార్థులు ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వం పౌష్టికాహారంతో పాటు అన్ని రకాల వసతులను సమకూరుస్తోంది.

**ఆదోని పట్టణంలో..**

ఆదోని పట్టణంలో బాలికల ఇంటిగ్రేటెడ్ వసతి గృహం ఒకటి, ఎస్సీ, బీసీ బాలుర, బాలికల వసతి గృహాలతో పాటు కళాశాలల వసతి గృహాలు కూడా ఉన్నాయి. 3వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులను వసతి గృహాల్లో చేర్చుకుంటారు. పట్టణంలోని అయా వసతి గృహాల్లో 1,800 మంది విద్యార్థిని విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు రాష్ట్ర పభుత్వం కాస్మోటిక్ చార్జీలతో పాటు పోషకాహారం, ట్రంకు పెట్టెలు, బెడ్ షీట్లను అందిస్తుంది. కాగా వసతి గృహం ఆధారంగా ప్రవేశాలు జరుగుతాయి. ఎస్సీ వసతి గృహం పరిమితి వంద మంది విద్యార్థులు. అయితే ఇప్పటికే 120 మంది ఉన్నారు. ఇంకా అడ్మిషన్లు కొనసాగుతున్నాయి.

**విద్యార్థులకు నాణ్యమైన భోజనం..**

విద్యార్థుల భోజనం కోసం రాష్ట్ర ప్రభుత్వం 3-10వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ.1,400 ఖర్చు చేస్తుంది. వీరికి ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం అందిస్తారు. మధ్యాహ్నం వేళల్లో పాఠశాలల్లోనే భోజనం ఏర్పాటు చేస్తారు. ఇంటర్ నుంచి డిగ్రీ చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ.1,600 వెచ్చిస్తుంది. వీరికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం వడ్డిస్తారు. వీటితో పాటు ప్రతి రోజు పాలు, ఉడకబెట్టిన కోడి గుడ్డు ఇస్తారు.

**ప్రతి నెలా కాస్మోటిక్ చార్జీలు..**

ఇక విద్యార్థులు నూనె, సబ్బులు, పేస్టులు తదితర వాటికి తల్లిదండ్రులకు భారం కాకూడదని ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీల పేరుతో ప్రతి నెలా కొంత మొత్తం అందజేస్తుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి క్రమం తప్పకుండా విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేస్తుంది. దీంతో తల్లిదండ్రులకు వారి ఖర్చుల భారం తప్పుతుంది. కాస్మోటిక్ చార్జీల కింద 3- 6వ తరగతి విద్యార్థులకు రూ.150, 7-10వ తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు రూ.200 ప్రకారం ప్రతి నెలా చెల్లిస్తారు.



బీసీ బాలుర వసతి గృహం

- బీసీ బాలుర వసతి గృహలో 3- 10వ తరగతి వరకు 250 మంది విద్యార్థులు ఉన్నారు. గతంతో 200 మంది విద్యార్థులు ఉండేవారు. ఇప్పుడు ఇంకా అడ్మిషన్లు జరుగుతున్నాయి.
- బీసీ బాలుర కాళాశాల వసతి గృహంలో ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు 350 మంది ఉన్నారు. వసతి గృహంలో చదువుకుంటూనే కళింగ అనే విద్యార్థి ఇంటర్‌లో 983 మార్కులు సాధించి పట్టణ టాపర్‌గా నిలిచాడు.

**వసతి గృహాల్లో రోజూ వారీగా అమలయ్యే మెనూ..**

| వారం | ఉదయం | మధ్యాహ్నం | సాయంత్రం | రాత్రి |
| --- | --- | --- | --- | --- |
| ఆదివారం | పాలు/ రాగి జావ ఇడ్లీ, సాంబర్ | తాళింపు,అన్నం చికెన్‌కర్రీ, మజ్జిగ | వేరుశనగ చిక్కీ | అన్నం పప్పు,రసం |
| సోమవారం | పాలు/ రాగిజావ కిచిడి,చట్నీ | స్కూల్‌లో.. | వేరుశనగ చిక్కీ | అన్నం,రసం వెజిటబుల్ పప్పు మజ్జిగ |
| మంగళవారం | పాలు/ రాగిజావ చింతపండు పులిహోరా చట్నీ | స్కూల్‌లో.. | వేరుశనగ చిక్కీ | చికెన్‌కర్రీ, మజ్జిగ తాళింపురైస్ |
| బుధవారం | పాలు/ రాగిజావ గోధమరవ్వ ఉప్మా, చట్నీ | స్కూల్‌లో.. | వేరుశనగ చిక్కీ | అన్నం,రసం వెజిటబుల్ పప్పు మజ్జిగ |
| గురువారం | పాలు/ రాగిజావ చిత్రాన్నం,పప్పుల పొడి | స్కూల్‌లో.. | వేరుశనగ చిక్కీ | అన్నము,రసం అకుకూరపప్పు మజ్జిగ |
| శుక్రవారం | పాలు/ రాగిజావ పెసరపప్పు కిచిడి | స్కూల్‌లో.. | వేరుశనగ చిక్కీ | అన్నము,రసం వెజిటెబుల్ పప్పు మజ్జిగ |
| శనివారం | పాలు/ రాగిజావ వగ్గాణి | స్కూలులో.. | వేరుశనగ చిక్కీ | అన్నం, రసం ఆకుకూరపప్పు మజ్జిగ |

– వారంలో అరటి పండు 3 రోజులు ఉడకబెట్టిన కోడి గుడ్డు 3 రోజులు ఇస్తారు.

**వసతి గృహాల్లో విద్యార్థులు ఇలా..**

- మంత్రాలయం, ఆదోని బీసీ బాలుర వసతి గృహాల్లో 250 మంది చొప్పున విద్యార్థులు ఉన్నారు. అడ్మిషన్లు ఇంకా జరుగుతున్నాయి.
- ఎస్సీ బాలుర వసతి గృహంలో 77 మంది విద్యార్థులు ఉన్నారు. అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 120 మంది దరఖాస్తు చేసుకున్నారని దరఖాస్తులను పరిశీలిస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు.
- ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గృహంలో 528 మంది విద్యార్థినులు ఉన్నారు.
- బాలికల కళాశాలలో 98 మంది ఉండగా.. 122 మంది వరకు పెరిగే అవకాశం ఉంది.
- పెద్దకడబూరు, కోసిగి, ఇంగళదహాళ్ గ్రామాల్లోని వసతి గృహాల్లో దాదాపు 180 మంది చొప్పున విద్యార్థులు ఉన్నారు.

**అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు**



మాది మంత్రాలయం మండలం నదిచాగి గ్రామం. అర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో బీఏ ఫైనలియర్ చదువుతున్నా. వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తుంది. పోషకాలతో కూడిన ఆహారం వడ్డిస్తున్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులు చదవుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు లేవు. – సురేష్, డిగ్రీ విద్యార్థి

**గతంలో కాస్మోటిక్ చార్జీలు ఇవ్వలేదు**



మాది పెద్దహరివాణం గ్రామం. అర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నా. గతంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు చెల్లించలేదు. ప్రస్తుతం నెలకు రూ.200 ప్రకారం ఇస్తున్నారు. అవి కూడా నేరుగా మా ఖాతాల్లోకే జమ అవుతున్నాయి. ఈ కాస్మోటిక్ చార్జీల ద్వారా సబ్బులు, పేస్టు వంటివి కొనుక్కుంటాము.ఆర్థికంగా మాకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. – కె. నాగరాజు, డిగ్రీ విద్యార్థి

**నిబంధనలకు అనుగుణంగా..**



ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నాం. తాగునీరు, వసతి సౌకర్యాలకు విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశాం. పాఠశాలల విద్యార్థులకు స్టడీ అవర్స్ ఏర్పాటు చేసి చదివిస్తున్నాము. – విశ్వనాథరెడ్డి, వార్డెన్, బీసీ వసతి గృహం, ఆదోని

## ముమ్మరంగా ‘నాడు-నేడు’ పనులు



దుద్దిలో నిర్మాణంలో ఉన్న తరగతి గదులు



పాఠశాల ప్రాంగణం ముందు ఏర్పాటు చేసి స్టేజ్

కోసిగి: మండలంలోని దుద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు కార్యక్రమం కింద నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రెండో విడుతలో రూ.1.65 కోట్లతో 9 అదనపు గదులు, ప్రహరీ, ప్రార్థన స్టేజ్ ప్రాంగణం పనులు పూర్తి కావచ్చాయి. ఇంకా టాయిలెట్స్, పెయింటింగ్, లైటింగ్, ఫర్నీచర్స్, బ్లాక్ బోర్డు, డ్రింకింగ్ అండ్ రన్నింగ్ వాటర్ పనులు చేయిస్తున్నట్లు నాడు-నేడు ఏఈ రంగరాజు తెలిపారు. పనులు వేగవంతం చేయించి త్వరలోనే వినియోగంలోకి తెస్తామని చెప్పారు. పనులు వేగంగా జరుగుతుండడంలో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## గ్రామసభలు సమర్థవంతంగా నిర్వహించాలి

ఆదోని అర్బన్ : గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, పరిష్కార మార్గాలు, అభివృద్ధి పనులు తదితర వాటిపై కేంద్రం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం అధికారులు ప్రతి నెల పల్లెల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి సలహాలు, సూచనలు, వారి అభిప్రాయాలు తీసుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, న్యాయవాది శ్రీధర్ కోరారు. ఆదివారం పట్టణంలోని ఓ హోటల్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాల్సి ఉండగా.. పలుచోట్ల తూతూ మంత్రంగా ముగిస్తున్నారని, అలాగే మరికొన్ని చోట్ల సభలు జరగకపోయినా నిర్వహించినట్లు చూపుతుండటం సమంజసం కాదన్నారు. జిల్లా అధ్యక్షుడు దేశాయ్‌చంద్రన్న, జిల్లా నాయకులు కిరణ్, జయరామ్, పట్టణాధ్యక్షుడు ఉస్మాన్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గొల్ల క్రిష్టన్న, కపటి రవికుమార్, కోశాధికారి చెన్నబసయ్య, ఎన్‌బీఐ కొండా పాల్గొన్నారు.

## దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు



పూజలందుకుంటున్న మాళ మల్లేశ్వరస్వామి

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగహారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆస్పరి మఠంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

## బిణిగేరిలో ప్రభోత్సవం



బిణిగేరిలో ప్రభను లాగుతున్న భక్తులు

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామంలో వెలసిన తిక్కతాత స్వామి ఆరాధన సందర్భంగా ఆదివారం స్వామి వారి ప్రభోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రభోత్సవాన్ని స్వామి వారి ఆలయం నుంచి చివర వరకు, తిరిగి ఆలయం వరకు లాగారు. ఆలయంలో స్వామి వారికి గంగ, ఆకుపూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

## రూ. 11 కోట్ల పంటల బీమా పరిహారం

ఆలూరు: వ్యవసాయ సబ్‌డివిజన్‌లో గత ఖరీఫ్‌లో సాగుచేసిన రైతులకు వైఎస్సార్ పంటల ఉచిత బీమా పథకం ద్వారా రూ. 11,32,93,751 కోట్లు పరిహారం మంజూరైనట్లు ఆలూరు వ్యవసాయ సంయుక్త సంచాలకులు సునిత ఆదివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈఏడాది ఖరీఫ్ పంటలకు సాగుకు ఇంకా అవకాశం ఉందని చెప్పారు.

## జీఓలను రద్దు చేయాలి

కర్నూలు సిటీ: అశాస్త్రీయం, అసంబద్ధమైన జీఓలను రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న డిమాండ్ చేశారు. ఆదివారం సలాం ఖాన్ భవనంలో ఏర్పాటు చేసిన ఎస్టీయూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. జాతీయ నూతన విద్యా విధానం వల్ల ప్రాథమిక విద్య నిర్వీర్యం అయ్యిందని, ఉపాధ్యాయుల పదోన్నతుల విషయంలో రోజుకో జీఓ తీసుకొస్తున్నారని, దీని వల్ల గందరగోళం నెలకొందన్నారు. జీఓ ఎంఎస్ నంబరు 145 సవరించాలని కోరారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పని చేస్తున్న టీచర్లకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 హెడ్ కింద జీతాలు చెల్లింపు, పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకారి, జనార్దన్, ఆర్థిక కార్యదర్శి పి.శివప్రసాద్, గోవిందు, రామచంద్రగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి మంత్రి రూ.లక్ష విరాళం



కమ్మరచేడు గ్రామంలో కాడ సిద్ధేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి విరాళమిస్తున్న మంత్రి జయరాం

ఆలూరు: మండలంలోని కమ్మరచేడు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ కాడ సిద్ధేశ్వరస్వామి ఆలయానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం రూ.లక్ష విరాళం అందజేశారు. స్థానిక మంత్రి నివాసంలో శనివారం ఆలయ నిర్వాహకులకు నగదును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె ప్రగతికి నాందిగా నిలిచిన ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలో ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి పనులపై ప్రజలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. నియోజక వర్గంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, సింగిల్ విండో అధ్యక్షులు , డైరెక్టర్లు, దేవాలయ కమిటీ చైర్మన్లు, వ్యవసాయసలహా మండలి చైర్మన్లు తదితరులు ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేయాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరభద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, బసవరాజ్‌స్వామి, రాజశేఖర్‌రెడ్డి, వీరభద్రి తదితరులు మంత్రిని సన్మానించారు.

## పత్తి పంటను దున్నేసిన రైతు



చిరుమాన్‌దొడ్డిలో పంటను దున్నేస్తున్న రైతు

ఆస్పరి: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎదుగుదలలేని పత్తి పంటను ఆదివారం మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన రైతు దున్నేశాడు. ముందస్తు వర్షాలు వస్తాయనే ఆశతో చంద్రన్న బోరు కింద రూ.90వేలు పెట్టుబడితో 6 ఎకరాలలో పత్తిని సాగు చేశాడు. వర్షాలు పడకపోవడంతో బోర్లలో నీరు తగ్గిపోవడంతో, పత్తి ఎదుగుదల లోపించిందని, దీంతో పంటను దున్నేస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. వర్షాలు వస్తే ప్రత్యామ్నాయంగా కందులు, సజ్జలు వేయనున్నట్లు తెలిపాడు. వర్షాభావంతో నష్టపోయిన తనకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని రైతు కోరాడు.

## ఊపందుకున్న భవన నిర్మాణ పనులు



ఆస్పరి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కొనసాగుతున్న కొత్త భవన నిర్మాణ పనులు

ఆస్పరి: మండలంలోని పాఠశాలల్లో నాడు- నేడు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని 31 పాఠశాలల్లో వివిధ రకాల మరమ్మతు పనులతో పాటు కొత్త భవనాల నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ. 5కోట్లు మంజూరు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్ తెలిపారు. ఆస్పరి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రూ. 26లక్షలతో రెండు కొత్త భవనాలను నిర్మిస్తున్నారు. మండలంలో ఆస్పరితో పాటు అట్టికల్లు, బైలుపత్తికొండ, బిణిగేరి, దొడగొండ, గార్లపెంట, హాలిగేర, ఐనకల్లు, జొహరాపురం, కలపరి, కారుమంచి, ములుగుందం, నగరూరు, పలకూరబండ, పుప్పాలదొడ్డి, తురువగల్లు, వలగొండ. వెంగళాయిదొడ్డి, యాటకల్లు, ముత్తుకూరు, తొగలుగల్లు, బిల్లేకల్లు, చిన్నహోతూరు, కైరుప్పల, కేజీబీవీ, చిగళి పాఠశాలల్లో 68 శాతం వరకు పనులు జరిగాయని ఏఈ చెప్పారు. తర్వలోనే అన్ని పాఠశాలల్లో వంద శాతం పనులు పూర్తి చేస్తామన్నారు.

## ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి



రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వీరస్వామి, ఏపీఓ శ్రీనివాసులు,

నందవరం: రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని గ్రామ సర్పంచ్ వీరస్వామి, ఏపీఓ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని గురజాల గ్రామంలో రైతులకు కొబ్బరి, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వంఉద్యాన పంటల పెంపకంపై 100 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యాన పంటల ద్వారా రైతులకు ఆదాయం పొంది అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఉపాధి సిబ్బంది ఉద్యాన పంటలపై రైతులను ప్రోత్సహించి, గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలో ఇప్పటి వరకు 3,000 మొక్కలను రైతులకు అందించామని ఏపీఓ తెలిపారు. కార్యక్రమంలో టీఏలు జయమణి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

### నేడు ‘గడప గడపకు మన ప్రభుత్వం’

కోసిగి: మండలంలోని జంపాపురం సచివాలయం పరిధిలోని ఐరన్‌గల్లు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ సచివాలయం పరిధిలో మూడో రోజు కార్యక్రమం కొనసాగుతోందని, కార్యక్రమానికి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి హాజరవుతారని చెప్పారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక హాజరు కావాలని కోరారు.

### బాలనాగిరెడ్డిపై గెలిచే సత్తా మీకుందా?

పెద్దకడబూరు: మంత్రాలయం ఎమ్మెల్యే వై.బా లనాగిరెడ్డిపై గెలిచే సత్తా మీకుందా అని మాజీ ఎంపీపీ రఘురాముడు టీడీపీ నాయకులకు సవాల్ విసిరారు. మండల కేంద్రంలో ఆదివా రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల క్రితం టీడీపీ నాయకులు చేపట్టిన బస్సు యాత్ర పెద్దకడబూరు చేరింది. అది బస్సుయాత్ర కాదని తుస్సుయాత్ర అని విమర్శించారు. ఒకరిద్దరిని కురవలను పార్టీలోకి బలవంతంగా చేర్చుకొని షో చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కురవులకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. రాష్ట్ర ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ పదవిని తన భార్య భాగ్యమ్మకు కట్టబెట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. మరోసారి వై.బాలనాగిరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడం ఖాయమని చెప్పారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్ : పట్టణంలోని అరులయ్యవీధికి చెందిన బి.హనుమంతు కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓసీ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు కలిగి ఉండగా అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సీఐ హరికృష్ణ ఆదివారం తెలిపారు. హనుమంతు నుంచి 74 ఓసీ డీలక్స్ విస్కీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. సెబ్ ఎస్ఐలు శివప్రసాద్, మధు, పీసీలు సోమేష్, ముని, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### హిందూ ధర్మాన్ని చాటిచెప్పాలి

ఆదోని అర్బన్ : హిందూ ధర్మాన్ని చాటి చెప్పాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసవన్న గౌడ్, గుంతకల్ నాయకుడు రామ్మూర్తి సూచించారు. స్థానిక కార్యాలయంలో సంఘం జిల్లా సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని, వచ్చే ఏడాదికి వీహెచ్‌పీ ఏర్పాటు చేసి 75ఏళ్లు అవుతున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. జిల్లా కార్యదర్శి హనుమంత రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా కోశాధికారి పంపాపతి, భజరంగదళ్ అధ్యక్షుడు రవిశంకర్, నగర అధ్యక్షుడు వీరన్న, ఉపాధ్యక్షుడు చిన్నబసప్ప, కార్యదర్శి నారాయణసింగ్ పాల్గొన్నారు.

### డ్రైనేజీ నిర్మించాలి

పెద్దకడబూరు : స్థానిక ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహం నుంచి హైస్కూల్ వరకు డ్రైనేజీ నిర్మించాలని డీవైఎఫ్ఐ జిల్లా, మండల కార్యదర్శులు నగేష్, దేవదాసు కోరారు. ఆదివారం ఎస్సీ కాలనీలోపర్యటించి సమస్యలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో భారీగా మురుగునీరు నిల్వ చేరుతుందని, దీంతో కాలనీవాసులు అనారోగ్యాలతో సతమతమవుతున్నారన్నారు. సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం సూన్యమన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రామన్న, అబ్రహం, తాయప్ప పాల్గొన్నారు.